క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో చోటు చేసుకొంది. పోలీసుల వివరాలు మేరకు.. చిన్నపరెడ్డిపల్లికి చెందిన కుమార్ కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురం తరలించారని పేర్కొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెట్ల పాదుల్లో మట్టిని తీసి చెట్ల చుట్టూ వేశారు. పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలన్నారు. ఇందుకు ఎన్ఎస్ఎస్ ఒక వేదిక అన్నారు. పీఓ ప్రతాప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంఈఓ

హిందూపురం టౌన్: పట్టణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. బుధవారం భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓ గంగప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని మొత్తం రూ.2,65,000 విలువగల ఐదు సీపీ చైర్లు, రెండు వీల్‌చైర్లు, రెండు జతల హియరింగ్ ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులకు అందించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపకరణాలు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం నుంచి అందే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు లలిత, నందిని తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ పీర్ ఖాద్రీ గంధం వేడుక



హజరత్ సయ్యద్ పీర్‌ఖాద్రీ సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రీ 63వ గంధం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రీ హిందూపురం పట్టణంలో ఉపాధ్యాయుడిగా సేవలను అందించారని నిర్వాహకులు తెలిపారు. ఆయన కుమారులు సయ్యద్ మదూమ్ హుస్సేన్ స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాలలో చదివి ప్రస్తుతం ప్రఖ్యాత భూ శాస్త్రవేత్తగా ఉన్నారన్నారు. హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రీ ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గౌసియా మసీదు ముతువల్లి రహమతుల్లా, పీర్‌ఖాద్రీ శిష్యబృందం పాల్గొని పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

అమరాపురం: మండలంలో రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీలోపు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలో ఇంతవరకూ 20 శాతం మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. ఇప్పటికైనా వారందరూ ప్రభుత్వం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సగం మందికీ అందని రేషన్



పెద్దకోడిపల్లిలో రేషన్ దుకాణం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

రొద్దం: మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఈ నెల బియ్యం కోటలో కోత విధించారు. కొందరి మాత్రమే బియ్యం పంపిణీ చేసిన డీలర్లు... మరికొందరికి రేషన్ బియ్యం అయిపోయినట్లు చెప్పారు. రేషన్ బియ్యం కోసం చౌకదుకాణం వద్దకు వెళ్తే బియ్యం లేవంటూ వెనక్కి పంపుతున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. పెద్దకోడిపల్లి రేషన్ షాప్‌కు లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమకు రావాల్సిన బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని డీలర్‌ను ప్రశ్నించారు. బియ్యం కోసం దుకాణం వద్ద బైఠాయించారు. మండలంలో 35 రేషన్ షాపులు ఉన్నాయి. మొత్తం 16,500 రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో దాదాపు వంద క్వింటాళ్ల బియ్యం బఫర్ ఉండడంతో ఈనెల కోటాలో రేషన్ షాపులకు తక్కువ వచ్చినట్లు సీఎస్‌డీటీ హనుమంతు చెప్పారు.

కాలుష్య కోరల్లో కొట్నూరు చెరువు



హిందూపురం నియోజకవర్గంలోనే అతి పెద్దదైన కొట్నూరు చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చెరువు పరిధిలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం, మాంసం, ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీకి చెందిన డ్రైనేజీ నీళ్లను చెరువులోకి విడుదల చేస్తుండటంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది.

- మున్సిపల్ మురుగు కాలువలను చెరువు కాలువకు మళ్లించిన వైనం
- ఇరిగేషన్ కాలువలో ప్లాస్టిక్, కుళ్లిపోయిన కళేబరాలు, డ్రైనేజీ నీరు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

కొట్నూరు చెరువు వివరాలు	
చెరువు కెపాసిటీ	80.51ఎంసీఎఫ్‌టీ
చెరువు మొత్తం	480 ఎకరాలు
ఆయకట్టు	1530 ఎకరాలు
చెరువు కట్ట పొడవు	3.15 కి.మీ

హిందూపురం టౌన్: పట్టణంలోని కొట్నూరు చెరువు మురికి కూపాన్ని తలపిస్తోంది. చెరువు వద్దకు వెళ్తే చాలు కంపుకొడుతోంది. మున్సిపల్ కాలువల ద్వారా వచ్చే మురుగు నీరు ఇరిగేషన్ కాలువలోకి వదులుతుండడంతో ఆ నీరు కొట్నూరు చెరువులోకి కలుస్తూ మురికి కూపంలా మారుతోంది. దీనికి తోడు ఇరిగేషన్ కాలువలోకి చెత్తా చెదారం, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను, కుళ్లిపోయిన కళేబరాలను వేస్తున్నారు. వీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో చుట్టూ పక్కల వారు ఆస్పత్రి పాలవుతున్నారు.

చెరువులోకి మురికి నీరు

మున్సిపల్ కాలువలు కొట్నూరు చెరువు సప్లయ్ ఛానల్‌లోకి కలుస్తుండడంతో దుర్గంధభరితంగా మారుతున్నాయి. ముఖ్యంగా పెనుకొండ రోడ్డులోని మేళాపురం సర్కిల్ సమీపంలో, ఆర్పీజీటీ రోడ్డులో, హస్నాబాద్‌లోకి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మున్సిపల్ మురుగు కాలువలు, అలాగే మరికొని చోట్ల మురికి కాలువలు ఆర్టీసీ కాలనీ, శ్రీకంఠపురం పరిసర ప్రాంతాల్లోని మురుగు నీరు కొట్నూరు చెరువు సప్లయ్ ఛానల్ ద్వారా చెరువుకు చేరుతున్నాయి. గ్రౌండ్ వాటర్‌తో పాటు



పెనుకొండ రోడ్డులో చెత్తాచెదారం, మురికి నీటితో నిండి ఉన్న సప్లయ్ ఛానల్

కొట్నూరు చెరువు కలుషితమవుతోంది. మురికి కాలువల నీరు చెరువులోకి సప్లయ్ ఛానల్‌లోకి కలుస్తుండడంతో కంపు భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలోని సరైన డ్రైనేజీ సిస్టమ్ లేకపోవడంతో పలు చోట్ల కాలువలను అనధికారంగా చెరువులోకి మళ్లించారని అంటున్నారు. కాగా మురికి నీరు కొట్నూరు చెరువులోకి చేరుతుండగా, కలుషితమైన నీటినే చెరువులోని బోర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ప్లాస్టిక్ డంపులా ...

కొట్నూరు చెరువుతో పాటు వెళ్లే ఇరిగేషన్ కాలువ ప్లాస్టిక్ డంపులా తయారైంది. చెరువు, కాలువలో



ఆర్పీజీటీ రోడ్డులో ప్లాస్టిక్ వర్థ్యాలతో నిండిన ఇరిగేషన్ కాలువ

సుమారు నాలుగు అడుగుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పట్టణంలో పలు చోట్ల చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ మొత్తాన్ని ఇరిగేషన్ కాలువలోకి వేస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. మేళాపురం సమీపంలో, హస్నాబాద్ తదితర ప్రాంతాల్లో ఇరిగేషన్ కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. అలాగే కుళ్లిపోయిన వ్యర్థాలను, జంతు కళేబరాలు, మాంసపు



మేళాపురం సమీపంలోని చెరువులో పడేసిన మాంసం వ్యర్థాలు

వ్యర్థాలు ఇరిగేషన్ కాలువలోకి వేస్తుండడంతో పూర్తి కలుషితంగా మారింది. వీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎక్కడో ఉన్న చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి ఇక్కడ వేస్తున్నారని, జంతు కళేబరాలను ఇక్కడ పడేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందనన్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు పూర్తిగా కలుషితం



కొట్నూరు చెరువులోని నీరు పూర్తిగా కలుషితమైంది. చెరువులోకి పట్టణంలోని మురికి నీరు మొత్తం వచ్చి చేరుతోంది. అలాగే చెరువులో నాలుగు అడుగుల మేర ప్లాస్టిక్ పేరుకు పోయింది. మాంసం వ్యర్థాలు, జంతు కళేబరాలకు చెరువు ఆవాసంగా మారిపోయింది. కలుషితమైన నీటినే మళ్లీ బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. కొట్నూరు చెరువు కలుషితంపై గ్రీన్ ట్రిబ్యూనల్‌కు ఫిర్యాదు చేస్తాం.

– భాస్కర్ రెడ్డి, పర్యావరణవేత్త, హిందూపురం

మున్సిపల్ అధికారులకు చెప్పాం

కొట్నూరు చెరువు సప్లయ్ ఛానల్‌లోకి మున్సిపాలిటీకి చెందిన మురికి కాలువలను అనధికారంగా కలుపుతున్నారు. మురికి నీటిని ఇరిగేషన్ కాలువల్లోకి వదులుతుండడంపై ఇప్పటికే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలుమార్లు లేఖల ద్వారా తెలియజేశాం. కొట్నూరు చెరువులోని నీరు కలుషితం కాకుండా చూస్తాం.

– యోగానంద్, డీఈ ఇరిగేషన్, హిందూపురం

భూ బాధితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకుడు సాకే హరి

హిందూపురం అర్బన్: కుశలవ భూ బాధితులకు అండగా ఉంటాం. భూములు తిరిగి రైతులకు దక్కేదాకా పోరాడుతాం' అని భూ పోరాట కమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కనకదాస కల్యాణ మండపంలో కేవీపీఎస్ రమణ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు భూ బాధితులకు సంఘీభావం తెలిపారు. మీ పోరాటాలకు మా మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. 2015–19 మధ్య కాలంలో లేపాక్షి మండలం కొండూరు, కొర్లకుంట పరిసర ప్రాంతాల్లో 250 ఎకరాల దళితుల అసైన్డ్ భూములను ప్రజా ప్రతినిధులు, అధికారులు చట్ట వ్యతిరేకంగా కుశలవ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సంస్థ పరం చేశారన్నారు. 150 మంది రైతులు తమ భూములు తమకు ఇప్పటించాలని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. చివరకు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. సంబంధిత రైతులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకుడు సాకే హరి, బహుజన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసులు, ఉదయ్, ఉమ్మర్ ఫారూక్, వినోద్‌కుమార్, శ్రీనివాసులు, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబావలి, రామాంజనేయులు, మారుతి, రవికుమార్ చలపతి, బాధిత రైతులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత చదువులు చదవాలి

- ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఉదయపావని

గుడిబండ: బాలురకు దీటుగా బాలికలు ఉన్నత చదువులు చదివి ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకోవాలని ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తప్ప అపరిచితుల వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసపోవద్దని సూచించారు. బాలికలే కుటుంబానికి మూల స్తంభాలుగా ఎదగాలన్నారు. తర్వాత పాఠశాల తరుపున ట్రైనీ డీఎస్పీ ఉదయ పావనికి శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసాద్, ఎస్ఐ రాజ్‌కుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హిందూపురం టౌన్: పేదలపై భారం మోపుతూ కేంద్రం ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పెంచిన ధరలను తగ్గించాలని స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జడ్పీ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.250 ఉన్న గ్యాస్ ధరను రూ.900కు పెంచిందన్నారు. గ్యాస్ ధరతో పాటు డీజిల్, పెట్రోల్, నిత్యావసర సరుకులు పెద్ద ఎత్తున పెంచారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ వీఆర్ రాము, కో కన్వీనర్ రామకృష్ణ, సీపీఎం నాయకులు రాజప్ప, బాబావలి, నందీశ్వర, రామాంజనప్ప, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, రమణ, మూర్తి, జయరాములు, చంద్రమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స కోసం వచ్చిన వృద్ధురాలు మృతి

పెనుకొండ రూరల్: చికిత్స కోసం వచ్చిన వృద్ధురాలు మృతి చెందిన సంఘన మండలంలోని గుట్టూరులో చోటు చేసుకుంది. రామగిరి మండలంలోని శేషంపల్లికి చెందిన నారాయణమ్మ (80) గుట్టూరులోని ఆర్ఎంపీ వైద్యుడు నాగరాజు వద్దకు చికిత్స కోసం వచ్చింది. అయితే అప్పటికే ఆయాసం ఎక్కువగా ఉండటంతో వైద్యుడు కొంత సేపు విశ్రాంతి తీసుకొమ్మని సూచించాడు. అంతలోనే ఆమె మృతి చెందగా... కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించినట్లు వైద్యుడు తెలిపారు. దీనిపై 'సాక్షి' కియా ఎస్ఐ రాజేష్ వివరణ కోరగా వృద్ధురాలి మృతికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

మారెమ్మకు జ్యోతులు

పావగడ: తాలూకాలోని మరిదాసనహళ్లిలో మారెమ్మ దేవి జాతరోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వెంకటేష్ పూజల్లో పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించండి

రొళ్ల: విద్యార్థులకు రుచికమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

రొళ్ల: జాబ్‌కార్డులు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి అవకాశాలు కల్పించి రోజు వారీ కూలీ బిల్లు రూ.307 అందేలా పనులు చేయించాలని ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఏపీఓ ఓబుళప్పతో కలిసి క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

బడుగుల ఆశాజ్యోతి ఫాదర్ ఫెర్రర్

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి గ్రామ ప్రజలు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఆర్డీటీ భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫెర్రర్ పేద ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయాడన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి

లేపాక్షి: మండలంలోని కొత్తపల్లి నుంచి ప్రధాన రహదారికి కలిసే రోడ్డును వేయాలని ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తికి వినతిపత్రాన్ని అందించారు. రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో బుధవారం రాత్రి జాతీయ రహదారిపై కారు – ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు అయినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న ధర్మవరానికి చెందిన అంజి, కడప జిల్లాకు చెందిన సురేష్ ఆటోలో పాలసముద్రం వైపు విధులకు వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో అంజి, సురేష్‌తో పాటు ఆటో డ్రైవర్ ఆంజినేయులు తీవ్రంగా పడినట్లు సీఐ పేర్కొన్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

తుమ్మల మారెమ్మకు పూజలు

గుడిబండ: మండల కేంద్రం శివారులో వెలసిన తుమ్మల మారెమ్మ, మద్దనకుంటలో వెలసిన కరియమ్మ జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. బుధవారం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు పేర్కొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: కుటుంబ సభ్యుల స్థితిగతుల పూర్తి వివరాలను ఆన్‌లైన్ డేటాలో పొందుపర్చడం కోసం సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే ప్రక్రియను సచివాలయ సిబ్బంది వేగవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సచివాలయం–1, 2 పరిధిలో సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వేను పర్యవేక్షించారు. తొలుత స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేపై అధికారులతో ఆరా తీశారు. డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ సర్వేలో ఉమ్మడి జిల్లాలో తనకల్లు, అగళి, పరిగి, రామగిరి, రొళ్ల మండలాలు పూర్తిగా వెనుకబడ్డాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 31,105 కుటుంబాలను ఇంకా సర్వే చేయలేదన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో సర్వేనే పూర్తి చేయాలని సూచించారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ

పావగడ: పట్టణంలోని కొండ బుడుములో బళ్లారి ప్రాంతానికి చెందిన వృద్ధుడు శంకరప్ప కిడ్నీలు ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న స్థానిక క్రైం విభాగం ఎస్ఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. కత్తితో పొడుచుకుకొని అపస్మారకస్థితిలో ఉన్న శంకరప్పను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాకీలో కాఠిన్యమే కాదు కరుణ కూడా ఉంటుందని ఎస్ఐ విజయకుమార్ నిరూపించారని పలువురు కొనియాడారు.

మాజీ మంత్రికి ఆహ్వానం

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు రత్నగిరి సంస్థానం దొర రంగప్పరాజు తెలిపారు. బుధవారం మడకశిరలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, రొళ్లలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులను ఆహ్వానించామన్నారు.

బాల్య వివాహాలకు చెక్

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి చెందిన గంగరాజు బాగేపల్లికి చెందిన శ్రీలక్ష్మి, ఐశ్వర్యతో ఈనెల 10వ తేదీ వివాహం జరగాల్సి ఉంది. అయితే శ్రీలక్ష్మీ, ఐశర్య మైనర్లు అని ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత , స్థానిక అంగన్‌వాడీ టీచర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇరు కుటుంబాలకు చెందిన వారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇరువురి వివాహాలు జరిపించమని స్టేట్ మెంట్ రికార్డు చేసుకొని వదిలేశారు. దీంతో పెళ్లి ఆగిపోయింది.

భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

రొళ్ల: మండల పరిధిలోని ఎల్‌కే పల్లి వడ్రహట్టి గ్రామంలో బుధవారం నూతనంగా యల్లమ్మదేవి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఆలయం నిర్మాణంలో భాగంగా భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేతుల మీదుగా నిర్వహించారు.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు

సోమందేపల్లి: గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాకారోత్సవం, మత్స్యావతారం, గజేంద్రమోక్షం, బ్రాహ్మణ సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పూజల అనంతరం ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

కాళికాదేవి, గంగమ్మకు పూజలు

హిందూపురం: స్థానిక సూరప్ప కట్ట వద్ద వెలసిన బోయకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం ఘనంగా మారు పూజలు జరిగాయి. రెండురోజుల పాటు ఆలయంలో భక్తులు మోహన్‌బాల ఆధ్వర్యంలో మూలవిరాట్ గంగమ్మదేవి, కాళికాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికామాతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	37.0
పెనుకొండ	38 .0
మడకశిర	37.0

గ్రామాల్లో తాగునీటి కష్టాలు



అగళి: వాటర్ ప్లాంట్ వద్ద బారులు తీరిన జనం



మూతపడిన ఆర్ఓ ప్లాంటు



తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గ్రామస్తుల పాట్లు

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామంలో తాగునీటి కష్టాలు తీవ్రం అయ్యాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ (శుద్ధ జలకేంద్రం) గత ఎనిమిది నెలలుగా పనిచేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మదర్ ప్లాంట్ నుంచి మిత్ర ఏజెన్సీ వారు వారంలో రెండు రోజులు మాత్రం ట్రాక్టర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నా అవి ఏ మాత్రం సరిపోవడం లేదని చెబుతున్నారు. ఆర్వోప్లాంట్‌కు మరమ్మతు చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు. దీనిపై 'సాక్షి' పంచాయతీ కార్యదర్శి ముత్యాలనాయుడును వివరణ కోరగా గ్రామానికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌లో మోటర్ మరమ్మతుకు గురైందన్నారు. మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

అగళి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ స్థాయిలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే వారం రోజులుగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన మెగా వాటర్ ప్లాంట్లకు నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం పలు గ్రామాల్లో నీటి కోసం వాటర్ ప్లాంట్ వద్ద పడిగాపులు కాశారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల ద్వారా చిన్న చిన్న వాహనాల్లో బిందె నీళ్ల కోసం రూ.10 నుంచి రూ.15 పెట్టి నీళ్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు చొరవ తీసుకుని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.